క్లుప్తంగా

సార్వత్రిక సమ్మెలో భాగస్వాములవ్వాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చొప్పదండి: ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెలో కార్మికులు భాగస్వాములు కావాలని సీఐటీయూ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మారంపల్లి నాగభూషణం కోరారు. మండల కేంద్రంలో ఆదివారం కార్మిక సంఘాల నాయకులతో కలిసి సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరించారు. త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, కోడ్స్ అమలైతే కార్మిక సంఘాలు ఏర్పాటు కష్టతరమవుతుందని, కార్మికుల సమష్టి బేరసారాల శక్తి నిర్వీర్యం అవుతుందన్నారు. జిల్లాలోని పవర్ లూం వర్కర్లు సమ్మెకు మద్దతు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దూస నర్సింగం, వీరబత్తిని మురళి, ఎలిగేటి వెంకటేశం, అనుమల్ల శంకరయ్య, గోనె రాజేశ్, మహేశుని బక్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపులు తనిఖీ

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలోని ఆర్ఎంపీ క్లినిక్స్, మెడికల్‌షాపులను ఆదివారం మెడికల్ కౌన్సిల్ అధికారులు తనిఖీ చేశారు. ఆర్ఎంపీలు ప్రభాకర్, అంజయ్య చేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. నిబంధనల ప్రకారం వైద్యం చేయాలన్నారు. లేదంటే ఆర్ఎంపీలపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేశవపట్నంలోని మందుల దుకాణాన్ని తనిఖీ చేశారు. ఫార్మసిస్ట్ ఎక్కడ ఉన్నారని దుకాణం యజమానిని ప్రశ్నించారు. ఫార్మసిస్ట్ లేకుండా మందులు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

నకిలీ వైద్యులపై ఉక్కుపాదం

తిమ్మాపూర్: తెలంగాణ మెడికల్ కౌన్సిల్ (టీజీఎంసీ) ఆదేశాల మేరకు జిల్లాలో నకిలీ వైద్యులు, క్లినిక్‌లపై తనిఖీలు కొనసాగుతున్నాయి. మండలంలోని పోరండ్ల గ్రామంలో టీజీఎంసీ సభ్యుడు డాక్టర్ యగ్గన్న శ్రీనివాస్ నేతత్వంలో తనిఖీ చేశారు. అర్హత, అనుమతి లేకుండా కొనసాగుతున్న క్లినిక్‌లో ఔట్‌పేషెంట్ కన్సల్టేషన్లు జరుగుతున్నాయని, యాంటీబయోటిక్, స్టెరాయిడ్స్ ,పెయిన్‌కిల్లర్స్ రోగులకు ఇస్తున్నాడని, ఆపరేషన్‌కు వాడే సర్జికల్ టూల్స్ గుర్తించారు. క్లినిక్‌కు అనుబంధం ఉన్న మెడికల్ షాపు ఓ ఫార్మసిస్ట్ పేరుతో నడుస్తోందని, నకిలీ వైద్యులు కాగితంపై రాసిన మందులు సరఫరా చేస్తున్నాయని వెలుగులోకి వచ్చింది. డ్రగ్ కంట్రోల్ అథారిటీకి ఫిర్యాదు చేస్తామన్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు తెచ్చే అవకాశం ఉందని టీజీఎంసీ ఆందోళన వ్యక్తం చేసింది. అనుమతి లేని క్లినిక్స్, మెడికల్ షాపులు చట్టవిరుద్ధంగా మందులు సరఫరా చేయడం కొనసాగిస్తున్నాయని, దీన్ని అరికట్టడానికి కఠిన చర్యలు అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

యూరియా సరఫరాలో కేంద్రం విఫలం


మాట్లాడుతున్న ముకుందరెడ్డి

శంకరపట్నం: యూరియా సరఫరాలో కేంద్రం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి ఆరోపించారు. కేశవపట్నంలో సీపీఎం కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. వానాకాలం ఆరంభమైనప్పటికీ తెలంగాణకు జూన్‌లో ఐదులక్షల మెట్రిక్ టన్నులకు మూడు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేసిందని, దీంతో ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల ఎదుట రైతులు క్యూ కడుతున్నా రని ఆరోపించారు. ఇదే అదునుగా వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారని, బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా విజిలెన్స్ తనిఖీలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి చెందిన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి యూరియా తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి రాజిరెడ్డి, తిరుపతి,చక్రపాణి, వెంకటేశ్, బుచ్చయ్యతదితరులు పాల్గొన్నారు.

జూనోసెస్ డే


టీకా వేస్తున్న పశువైద్యాధికారి గిరిధర్‌రావు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట పశువైద్యశాలలో ఆదివారం గోపాల్‌రావుపేట లయన్స్‌క్లబ్, గోల్డెన్ శాతవాహన లయన్స్ క్లబ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ప్రపంచ జూనోసెస్ డే నిర్వహించారు. గ్రామంలోని పెంపుడు కుక్కలకు పశువైద్యాధికారి గిరిధర్‌రావు రేబిస్ టీకాలు వేశారు. లయన్స్ క్లబ్ గోపాల్‌రావుపేట అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి మోహన్, ప్రతి నిధులు అంజియాదవ్, మధుసూదన్ రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, గిరిధర్ రావు, నర్సింహరెడ్డి, శంకర్, అజయ్‌కుమార్, రాములు పలువురు పాల్గొన్నారు.

శిథిలావస్థలో చేపల కేంద్రం భవనం



శంకరపట్నం: కేశవపట్నం చేపల కేంద్రం మత్స్య శాఖ అధికారి కార్యాలయం భవనం శిథిలమై కూలిపోతోంది. సుమారు 3 దశాబ్దాల క్రితం ఎస్సారెస్పీ నిర్మాణం సమయంలో కేశవపట్నం చెరువుకు గండి పెట్టారు. ఈ చెరువులో చేపల కేంద్రం కోసం భవనం, చేప పిల్లల పెంపకం కోసం కుండీలు కట్టారు. సిమెంట్‌తోపాటు పదేళ్ల క్రితం సుమారు రూ.30లక్షలతో చేప పిల్లల పెంపకం కోసం మట్టితో కుండీలు చేశారు. భవనం శిథిలం కావడంతో చేప పిల్లల పెంపకంపై అధికారులు దృష్టి సారించడం లేదన్న ఆరోపణలున్నాయి. ఒకప్పుడు హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లోని కొన్ని మండలాల చెరువులకు కేశవపట్నంలో ఉత్పత్తయిన చేప పిల్లలు తీసుకుపోయేవారు. కేశవపట్నం ఎఫ్‌డీవో భవనం నిర్మించి చేప పిల్లల ఉత్పత్తికి మత్స్య శాఖ మంత్రి చొరవ తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.

మూతబడిన బీసీ బాలికల హాస్టల్



శంకరపట్నం: కేశవపట్నం బీసీ బాలికల హాస్టల్ మూతబడింది. గత విద్యాసంవత్సరం చివర్లో విద్యార్థులు లేరని మూసేశారు. సుమారు రెండు దశాబ్దాలుగా కేశవపట్నం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకునే విద్యార్థినులు బీసీ బాలికల హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యసించారు. ప్రతి ఏటా 150 నుంచి 200 వరకు విద్యార్థినులు హాస్టల్‌లో ఉండి ఉత్తమ ఫలితాలు సాధించారు. గతేడాది 10 లోపు విద్యార్థినులుండగా.. ట్రైనీ కలెక్టర్ హాస్టల్‌ను సందర్శించడంతో విద్యార్థులు లేరని వెలుగులోకి వచ్చింది. కారణాలు తెలియదు కాని గత విద్యాసంవత్సరం చివర్లో బీసీ బాలికల హాస్టల్‌ను మూసేశారు. ఈ విద్యాసంవత్సరం హాస్టల్‌లో ప్రవేశాలకు సంక్షేమ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో తెరచుకోలేదు. మూతబడిన హాస్టల్‌లో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నట్లు తెలిసింది.

ఘనంగా బీరన్న బోనాలు

హుజూరాబాద్: పట్టణంలోని యాదవనగర్ నుంచి యాదవ సంఘం అధ్యక్షుడు బద్దుల రాజ్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో తొలి ఏకాదశిని పురస్కరించుకొని పట్టణ శివారులోని సిర్సపల్లి క్రాస్‌రోడ్డు వద్ద బీరన్న ఆలయానికి మహిళలు నెత్తిన బోనాలతో తరలివెళ్లారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో యాదవ సంఘం ప్రధాన కార్యదర్శి బాషబోయిన చిన్న రవి, కార్యవర్గ సభ్యులు సింగరేణి రవి, గంద్రకోట సారయ్య, గాదం స్వరూప, మక్కపల్లి కుమార్ స్వామి, బాషబోయిన చిన్న శ్రీనివాస్, రవి, ఓదెలు, రవి, మొండయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటరూరల్: మండలంలోని మాచనపల్లి గ్రామంలో తొలి ఏకదశి పర్వదినం పురస్కరించుకొని ఆదివారం యాదవ కులస్తులు బీరన్న బోనాలు ఘనంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఒగ్గుడోలు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.


హుజూరాబాద్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు

దరఖాస్తులు ఆహ్వానం

హుజూరాబాద్: డివిజన్‌లోని ఎస్సీ హాస్టల్‌లో 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ అధికారి ఎం. విజయ్‌పాల్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. మూడు నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 9399957766 నంబర్ సంప్రదించాలన్నారు.

నేడు గోరింటాకు మహోత్సవం

చొప్పదండి: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయంలో సోమవారం ఆషాఢ మాసం పురస్కరించుకొని గోరింటాకు మహోత్సవం నిర్వహించనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ బొడిగె వెంకటేశ్ గౌడ్ తెలిపారు. మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి మహోత్సవం విజయవంతం చేయాలన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా తొలి ఏకాదశి


జమ్మికుంట: ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

జమ్మికుంట: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి, గీతామందిర్, శ్రీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో తొలి ఏకాదశిని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. స్వామివారికి అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆయా ఆలయాల అర్చకులు, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

అఖండ భజన సంకీర్తనలు

గంగాధర: మండలంలోని గర్షకుర్తి గ్రామంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో 24 గంటల అఖండ భజన సంకీర్తనలు ఆదివారం ఉదయం ఘనంగా ప్రారంభించారు. ఏటా తొలి ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహిస్తామని, 55 సంవత్సరాలుగా చేపడుతున్నామని ఆలయ కమిటీ చైర్మన్ కల్వకోట శ్రీనివాసరావు, స్థానిక భజన మండలి అధ్యక్షుడు శివరామకృష్ణ తెలిపారు. గర్శకుర్తితో పాటు కరీంనగర్, కొత్తపల్లి, పూడూరు, చొప్పదండి, ఉప్పరమల్యాల గ్రామాలు, ఇతర ప్రాంతాల నుంచి భజన మండలి సభ్యులు తరలివచ్చి భక్తిపాటలు, సంకీర్తనలతో అలరించారు.


గంగాధర: సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

ఉల్లంపల్లిలో భగవద్గీత గ్రంథాల పంపిణీ

చిగురుమామిడి: మండలంలోని ఉల్లంపల్లి గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను ఇంటింటా పంపిణీ చేశారు.



చిగురుమామిడి: ప్రచారం నిర్వహిస్తున్న హిందూ జ్ఞానవేదిక సభ్యులు

హుజూరాబాద్ హిందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో 10న గురుపౌర్ణమి సదర్భంగా భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించామని కమిటీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తెలిపారు. త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథం శ్రీకృష్ణుడి అసలైన జ్ఞానం తెలియజేస్తుందని, శ్రీకృష్ణ భగవానుడిని మాత్రమే జగద్గురువుగా భావించి గురుపౌర్ణమి రోజున ప్రత్యేక పూజలు చేయనున్నామని వివరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సతీష్‌చారి, గోపికృష్ణ, శ్రావన్, సిద్దార్థ్, రామస్వామి, పద్మ, జ్యోతి, సరిత, ప్రియాంక, అద్వితీయ, శ్రీదేవి, నక్షత్ర, నరేశ్ పలువురు పాల్గొన్నారు.



రామడుగు: మండలంలోని వెదిర గ్రామ పంచాయతీ పరిధి కోనరావుపేటకు వెళ్లే రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందిపడుతున్నారు. అలాగే నిత్యం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంకు వెళ్లే ఉపాధ్యాయులు, విద్యార్థులు అవస్థలుపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి గుంతలు పూడ్చివేయాలని కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
రాజేశ్వరి, ఎంపీడీవో, రామడుగు, సెల్ నంబర్: 9640333888

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227



ఖాళీబిందెలతో మహిళల ధర్నా

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆదివారం మహిళలు తాగునీటి కోసం ఖాళీబిందెలతో ధర్నా నిర్వహించారు. ఉదయమే నాలుగు, ఐదోవార్డులకు చెందిన మహిళలు ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టారు. మూడు నెలలుగా కాలనీకి తాగునీరు రావడంలేదని గ్రామ పంచాయతీ కార్యదర్శికి విన్నవించినా పట్టించుకోవడంలేదని, గ్రామసభల్లో సమస్యపై ఫిర్యాదు చేసినా స్పందన లేదని, సంబంధిత అధికారులు ఇప్పటికైనా తాగునీటి సౌకర్యం కల్పించాలని, లేనిపక్షంలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని మహిళలు హెచ్చరించారు. నిరసనలో సత్తవ్వ, రంగు స్వప్న, అనంతుల సరోజన, శోభ, కొంరవ్వ పలువురు పాల్గొన్నారు.


చిగురుమామిడి: కొండాపూర్‌లో మొక్కులు చెల్లిస్తున్న మహిళలు

మొహర్రం వేడుకలు

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ గ్రామంలో ఆదివారం మొహర్రం నిర్వహించారు. హిందూ, ముస్లింలు పీర్లకు మొక్కులు చెల్లించారు. సాంప్రదాయం ప్రకారం వివిధ వేషధారణలతో గ్రామంలో సందడి చేశారు.

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం మొహర్రం నిర్వహించారు. డప్పుచప్పుల్ల మధ్య పీరీలను వాడవాడలా ఊరేగించారు. కొండాపూర్, ఉల్లంపల్లి, చిగురుమామిడి, బొమ్మనపల్లి, రామంచ, ముదిమాణిక్యం గ్రామాల్లో కులమతాలకు అతీతంగా ఆడిపాడారు. మహిళలు సంతానం కోసం మొక్కులు చెల్లించుకున్నారు.

జమ్మికుంటరూరల్: మండలంలోని మడిపల్లి గ్రామంలో ఆదివారం మొహర్రం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలో పీరీల ఊరేగించి రాత్రి నిమజ్జనం చేశారు. డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.


జమ్మికుంటరూరల్: మడిపల్లి గ్రామంలో..

హిందూ, ముస్లింలు ఐక్యతతో జరుపుకునేది పీరీల పండుగని, పీరీలకు మొక్కులు చెల్లిస్తే కష్టాలు తీరుతాయని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు వొల్లాల సాంబయ్య, మూగల మొగిలి, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి


మానకొండూర్: పూలమాలవేస్తున్న నాయకులు

మానకొండూర్: మండల కేంద్రంలో నాయకులు భారత మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్ రామ్ వర్ధంతి నిర్వహించారు. తూర్పు దర్వాజా వద్ద జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ జెడ్పీటీసీ శేఖర్ గౌడ్, నాయకులు ప్రేమ్ కుమార్, సురేష్, వెంకటస్వామి, యాదగిరి, సాజిద్, తాజుద్దీన్ నాయకులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండల కేంద్రంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో బాబు జాగ్జీవన్‌రామ్ వర్ధంతి నిర్వహించారు. ఆలయన చిత్రటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మున్వీందర్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు అనిల్, రమేష్, రాజయ్య, రాజమల్లు, లింగయ్య, సంపత్, శ్రీనివాస్, వెంకటేష్, సతీష్, రాజయ్య, రాజ్‌కుమార్, ఐలయ్య, చంద్రమౌళి, కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.


గన్నేరువరంలో...


హుజూరాబాద్: నివాళి అర్పిస్తున్న నాయకులు


కేశవపట్నంలో నివాళి అర్పిస్తున్న అనిల్

శ్యామాప్రసాద్ ముఖర్జీకి నివాళి

హుజూరాబాద్: జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతిని ఆదివారం బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖర్జీ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ముఖర్జీ సేవలను స్మరించుకున్నారు. నాయకులు ప్రభాకర్, సారయ్య, వెంకటేశ్, శశిధర్,రాజు, వాసు, రమేశ్, నాగరాజు, వీరస్వామి, సంపత్, కొండల్‌రెడ్డి తదితరులున్నారు.

ఇల్లందకుంట: పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని బీజేపీ మండల అధ్యక్షుడు బైరెడ్డి రమణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో నాయకులతో కలిసి మొక్కలు నాటారు. శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో తాళ్ల పాపిరెడ్డి, రావుల విజయ్‌బాబు, నల్ల లింగారెడ్డి, ఇంగ్లే రమేశ్, తిప్పరబోయిన సమ్మయ్య, శ్రీనివాస్, మురళి, భరత్, వీరస్వామి, సారయ్య తదితరులు పాల్గొన్నారు.


ఇల్లందకుంట: మొక్కలు నాటుతున్న నాయకులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీజేపీ మండల అధ్యక్షుడు ఏనుగుల అనిల్ పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మండలం వ్యాప్తంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో జైపాల్, నరేందర్, అశోక్, సాగర్, శ్రీనివాస్, సారయ్య, గుర్లరాజు, సాయి, ప్రకాశ్, శివకుమారు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గంగాధర: కరీంనగర్– జగిత్యాల ప్రధాన రహదారి మధురానగర్ చౌరస్తా సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కొడిమ్యాల మండలం నమిలకొండ గ్రామానికి చెందిన బుచ్చిబాబు బంధువుల అబ్బాయితో కలిసి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొట్టింది. తీవ్ర గాయాలుకావడంతో ఇద్దరిని కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.

సన్మానం

కొత్తపల్లి: తెలంగాణ మున్నూరు కాపు రాష్ట్ర సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన చల్ల హరిశంకర్ పటేల్‌ను ఆదివారం కరీంనగర్ మంకమ్మతోటలోని ఆయన నివాసంలో బద్దిపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం చైర్మన్ ఉప్పు తిరుపతి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించారు. సంఘం బలోపేతానికి శాయశక్తులా కృషిచేస్తానని, అందుకు కులస్తులంతా సహకారం అందించాలని ఈ సందర్భంగా హరిశంకర్ కోరారు.

'పొన్నం'ను కలిసిన టీఎన్జీవోల సంఘం నేతలు

కరీంనగర్ అర్బన్: తొలి ఏకాదశి సందర్భంగా రాష్ట్ర బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను ఆదివారం టీఎన్జీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. పండుగ శుభాకాంక్షలు తెలిపి వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులకు సంబంధించిన పలు సమస్యలను ప్రస్తావించారు. రెసిడెన్షియల్ పాఠశాలలకు సంబంధించిన కామన్ మెనూను వసతి గృహాల్లో అమలుపర్చడంలో ఎదురవుతున్న ఇబ్బందులను వివరించారు. పెండింగ్‌లో ఉన్న వసతి గృహ సంక్షేమాధికారుల పదోన్నతుల్లో ఏర్పడిన ప్రతిష్టంభనను తెలుపగా సానుకూలంగా స్పందించి కమిషనర్‌లతో చర్చించి త్వరలో సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో టీఎన్జీవోల సంఘం జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణరావు, నాయకులు మల్క రాజేశ్వరరావు, వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మచ్చేందర్, జిల్లా అధ్యక్షుడు బోనాల రవి, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా వేసిన పైపులను తొలగించాలి



శంకరపట్నం: మండలంలోని తాడికల్ చెరువునీటి కోసం పదిమంది రైతులు పైపులు వేశారు. చెరువు కింద 200 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. చెరువు మత్తడి నుంచి కాలువల ద్వారా భూములకు సాగునీరు సరాఫరా అవుతుంది. మత్తడి నీటిని కాలువల ద్వారా వివిధ ప్రాంతాలకు నీరు అందుతుండగా ఆదివారం మత్తడి నుంచి భారీ పైపులు వేశారు. నేరుగా పైపుల ద్వారా నీరు వెళ్తే ఇతర రైతుల భూములకు సక్రమంగా నీరు అందదని మిగతా రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు వంద మంది రైతులకు నష్టం కలిగించే విధంగా అక్రమంగా వేసిన పైపులను అధికారులు తొలగించాలని కోరుతున్నారు.